జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 11-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 751 పేజీలు: 4 వెల : రూ.7

# అన్నదాత.. గుండెకోత!



సంతబొమ్మాళి, ఆగస్టు 10 (వార్త):ఖరీఫ్ ఆరంభంలోనే అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు వరుణుడు ముఖం చాటేయడం.. మరోవైపు సాగునీరు అందకపోవడం.. వెరసి రైతన్న పరిస్థితి దయనీయంగా మారింది. పంటపై ఆశలు పెట్టుకుని విత్తనాలు చల్లి నారుమడులు సిద్ధం చేసిన రైతులు ఇప్పుడు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. పెట్టుబడులు పెట్టి సాగుకు సిద్ధమైనా.. ప్రకృతి సహకరించకపోవడంతో అన్నదాత గుండె కోతకు గురవుతున్నాడు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు పడడం లేదు. వర్షాలు లేకపోవడంతో నారుమడుల్లో తేమ తగ్గి అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో కూడా నీటి కొరత కారణంగా ఎదలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో నీరు అందకపోతే పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు.  కాలువల్లోనూ నీరు లేకపోవడంతో ఏం చేయాలో తెలియ రైతులు అల్లాడిపోతున్నారు. ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసి.. నారుమడులను కాపాడుకుంటున్నారు. పంట సాగు ప్రారంభం కాకముందే నీటి కోసం అదనపు ఖర్చు చేయాల్సి రావడంతో చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా మరింత భారాన్ని మోయాల్సి వస్తోంది. పంట చేతికి రాకముందే నీటికి ఖర్చే! అన్నట్లుగా రైతుల పరిస్థితి మారింది. చివరి ఆయకట్టు భూములకు కూడా సాగునీరు

**☼ ఆదిలోనే ఖరీఫ్‌కు నీటి గండం ☼ వర్షం లేదు.. సాగునీరు రాదు ☼ ఎండిపోతున్న వరి నారుమడులు ☼ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసి నారుమడులను కాపాడుకుంటున్న రైతులు ☼ ఎల్ నినో ప్రభావం అంటున్న వ్యవసాయ అధికారులు ☼ ఆరుతడి పంటలు వేసుకోమంటున్న ప్రభుత్వం**





అందిస్తామని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు ఆచరణలో కనిపించడం లేదు. ఖరీఫ్ సాగు కోసం రైతులు ముందుగానే విత్తనాలు, ఎరువులు సమకూర్చుకున్నారు. దుక్కులు, నారుమడులు, కూలీల ఖర్చులు కలిపి ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టారు. అయితే వర్షాలు లేకపోవడంతో ఆ పెట్టుబడులు కూడా ప్రమాదంలో పడ్డాయి. ఒకవైపు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుండగా.. మరోవైపు పంట సాగు కోసం నీటిని సమకూర్చుకోవడం రైతులకు అదనపు భారంగా మారుతోంది.  రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటేనే మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. అయితే రైతులు ఏ పంట వేయాలో అన్నది మాత్రం చెప్పడం లేదు.



సీదిరికి కస్టడీకి ఇవ్వాలని

## పోలీసుల పిటిషన్

పలాస, ఆగస్టు 10 (వార్త): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును నాలుగు రోజులు కస్టడీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసులు మరో మరో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు సోంపేట ఆరో అదనపు జిల్లా కోర్టులో మాజీ మంత్రి అప్పలరాజుకు బెయిల్ పిటిషన్‌ను ఆయన తరపు న్యాయవాది వేశారు. ఇదిలా ఉండగా  జూలై 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో సాక్షాధారాలు తారుమారు చేశారని అభియోగంతో జూలై 22వ తేదీన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.  ప్రస్తుతం సీదిరి అప్పలరాజు అంపోలు జైలులో ఉన్నారు. ఆయన కుమారుడికి బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మెరిట్‌కు కత్తెర.. అక్రమాలకు పట్టం!

**- డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌సీపీ ఆందోళన**

**- లోకేష్ రాజీనామా చేయాలి**

**- సీబీఐతో సమగ్ర విచారణ జరపాలి - మాజీమంత్రి సీదిరి సతీమణి శ్రీదేవి**



**పలాస, ఆగస్టు 10 (వార్త):** డీఎస్సీ పరీక్షలు, నియామకాల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పలాసలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని, మెరిట్‌ను పక్కనపెట్టి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఆయన సతీమణి, వైఎస్సార్‌సీపీ నేత సీదిరి శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీలతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివచ్చారు. ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరిన వారిని కాశీబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీదిరి శ్రీదేవి మాట్లాడుతూ డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాల్లో మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. కృష్ణా జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన అవినాష్ అనే అభ్యర్థికి ఉద్యోగం ఇవ్వకుండా, తక్కువ మార్కులు సాధించిన వారికి నియామకాలు ఎలా కల్పించారని ప్రశ్నించారు. మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల ప్రకటన, నియామకాలు చేపట్టే వరకు ప్రతి దశలోనూ అవకతవకలు జరిగాయని ఆమె ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి, డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు. నిజమైన అర్హత ఉన్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యా వ్యవస్థను కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై వచ్చిన ఆరోపణలన్నింటినీ నిగ్గు తేల్చేందుకు సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని సీదిరి శ్రీదేవి డిమాండ్ చేశారు. సమగ్ర దర్యాప్తుతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కోరారు. నిరసనలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు 'మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి', 'డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి', 'లోకేష్ దిగిరా' అంటూ నినాదాలు చేశారు. పాటలు, నినాదాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్‌యాదవ్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్యయాదవ్, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగసాయి కృష్ణయాదవ్, పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, పలాస నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుజాత పండా, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, పలాస మండల అధ్యక్షుడు దువ్వాడ రవి, జిల్లా కార్యదర్శులు దువ్వాడ మధుకేశ్వరరావు, అగ్గున సూర్యారావు, సీనియర్ నేతలు సొర్ర దిల్లేశ్వరరావు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ, బత్తిన లక్ష్మణ్, పి.గురయ్యా నాయుడు, చింతాడ మాధవరావు, మద్దిలి బాలకృష్ణయాదవ్, సేనాపతి కిషోర్, కర్రి గోపాల్, బల్ల లీలకుమారి, సేనాపతి దివ్య, మార్పు వెంకటరమణ, మార్పు భవాని, మజ్జి హేమరాజ్, సీర ప్రసాద్, సిందిరి జగన్, నాగేశ్వర బృందావన్, దుర్గా శంకర్ పండా, బమ్మిడి సంతోష్, కంచరాన చినబాబు, బోర చంద్రకళ, యళ్ల సంతోష్, ఉషారాణి, లక్ష్మి, చింతల సరస్వతి, బిరాటి వల్లభ, సనపల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



## బూరగాం సంబరాలకు ముహూర్తం ఖరారు



**కంచిలి, ఆగస్టు 10(వార్త):** బూరగాం గ్రామ ఇలవేల్పు పోలమ్మ తల్లి సంబరం మహోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. వచ్చే ఏడాది మే తొమ్మిదో తారీఖు నుంచి 18 వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆలయ పరిధిలో సోమవారం పండితుని సమక్షంలో ముహూర్తాన్ని ఖరారు చేశారు. సుమారు 1200 కుటుంబాలు నివసిస్తున్న బూరగాం గ్రామంలో అనేక సామాజిక వర్గాలు నివసిస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి అధికమంది జీవిస్తుండగా చాలామంది ఇతర దేశాల్లో ఉపాధి కోసం వెళ్లి పనులు కొనసాగిస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత నిర్వహించనున్న అమ్మవారి సంబరాలను ఎంతో వైభవంగా చేపట్టేందుకు గ్రామస్తులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గోపాల్ కుటుంబానికి వైసీపీ నేతల పరామర్శ



**కంచిలి, ఆగస్టు 10(వార్త):** వైసీపీ కార్యకర్త ఆర్. గద్దలపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ గోపాల్ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని వైసీపీ నేతలు, ఇచ్ఛాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ తదితరులు సోమవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. గోపాల్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సల్ల దేవరాజు, ఎలమంచి నీలయ్య, సాలిన గాంధీ, తలగాని తిరుపతి, గణప సింహాచలం, కప్ప వెంకటరమణ, సాడి జయరాం, భాస్కరరావు, తలగాన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా మేమున్నాం



**కంచిలి, ఆగస్టు 10(వార్త):** నిరంతరం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సోంపేటకు చెందిన మేమున్నాం సేవా సంస్థ సభ్యులు మానవత్వమే మహాధర్మంగా బావించి కంచిలి మండలం బూరగాం గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన దూపాన మాధవ రావుకు 57,500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. దూపాన మాధవరావు కొంత కాలం విదేశాలలో పని చేస్తూ ఆరోగ్యం బాగులేకపోవడం వలన స్వదేశం తిరిగివచ్చారు. రోజు రోజుకు బాగా క్షీణించపోవడం, ప్లేట్ లెవెల్స్ తగ్గిపోవడం వలన వివిధ ఆసుపత్రులకు వెళ్ళినా ఫలితం దక్కలేదు.చివరకు బోన్ మార్ వ్యాధి తో బాధపడుతున్నట్టు గుర్తుంచారు.5 నెలలు నుండి ఈ వ్యాధి తో బాధపడుతూ సుమారు 9 లక్షల వరకు ఖర్చు చేస్తూ ప్రస్తుతం వెల్లూరులోనీ క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు.పూర్తిగా కోలుకోవడానికి, ఇంకా ఉన్నతమైన చికిత్స పొందుటకొరకు దాతలు సహాయం కోసం ఎదురు చూస్తూండగా సోంపేటకు చెందిన మేమున్నాం సేవా సంస్థ (1987-88 పదవ తరగతి బ్యాచ్) స్పందించి ఈ సహాయాన్ని అందజేశారు. మాధవరావు భార్య,తల్లిదండ్రులు కూడ కూలీ పనులు చేస్తూ బ్రతుకుతున్నారు.ఈ కార్యక్రమంలో మేమున్నాం సేవా సంస్థ అధ్యక్షులు తడక మాధవ రావు,వాసు పాణిగ్రాహి, కప్ప గోపినాథ్,పసుపురెడ్డి రాము, బరాటం సతీష్,నాగరాజు, బల్ల జానకీ రావు, గణిత అవధాని మడ్డు తిరుపతి రావు మాస్టర్, సానా మధు, శంకర్,విజయశంకర్, కొండల రావు, మొదలగు వారు పాల్గొని మాధవ రావు వేగంగా కోలుకోవాలని కోరారు.

## ఆధ్యాత్మిక ఆలోచనలతో ఉన్నతంగా రాణించాలి

**కవిటి, ఆగస్టు 10(వార్త):** కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి లజపతిరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగి ఉండాలని, రామాయణంలో విజ్ఞానం ఉందని, విజయనగరం సమీపంలోని రామనారాయణం సందర్శించాలని కోరారు. విశ్రాంత ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య ప్రసంగిస్తూ కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల విశిష్టతను కొనియాడుతూ విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సింహాచలం నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టి సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద మొగిలీపురి కృష్ణారావు కుమార్తె కీర్తి జన్మదినం సందర్భంగా 20 మొక్కలు, 25 యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వాస్తవ్యులు వేదవతి భాగవతారిణి చే హారికథా గానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉషోదయ యువజన సంఘం నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-ఇంటింటికీ కూటమి ప్రభుత్వం**

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-కొమరల్తాడాలో ఇంటింటా పర్యటన**



**పలాస, ఆగస్టు 10 (వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడా గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని గౌతు శిరీష పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం" కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి భూమిపూజ కార్యక్రమంలో భాగంగా సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై స్థానికులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్, కో-కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఒక మనిషి.. ఒక మొక్క!

**-పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శ్రీచైతన్య విద్యార్థుల పిలుపు**

**పలాస, ఆగస్టు 10 (వార్త):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, "ఒక మనిషి.. ఒక మొక్క" అనే ఆలోచనను ఆచరణలో పెట్టాలని గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో పలువురు పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య స్కూల్‌లో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో బాదం, చెర్రీ తదితర పండ్లను ఇచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ ఋషికేశ్ దాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ "ఒక మనిషి.. ఒక మొక్క" అనే ఆలోచనతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈరోజు నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీడ, వర్షాలు, జీవనాధారాన్ని అందిస్తాయని తెలిపారు. ఏపీ ఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ పలాస అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని విద్యార్థులను కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నీటిని సంరక్షించాలని, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ఎస్. జోగారావు, ఐకాన్ ఇన్‌చార్జి కొండల షణ్ముఖరావు, ప్రైమరీ ఇన్‌చార్జి నీలవేణి, ఉపాధ్యాయులు మనోజ్, ఏవో జైబాబు తదితరులు పాల్గొన్నారు.

## 16న చైతన్యదీపిక ఆధ్వర్యంలో సర్దార్ జయంతి

**సోంపేట, ఆగస్టు 10(వార్త):** సోంపేటలో సోమవారం శ్రీశయన చైతన్య దీపిక సమావేశం దేవాడ మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈనెల 16న సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుటకు తీర్మానించారు. ఈ సందర్భంగా సోంపేటలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి దుద్ది వీర్రాజు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ పెన్షన్ అందిస్తాం

**- ఎమ్మెల్యే కూన రవికుమార్**

**- కొత్తగా మంజూరైన 50 స్పౌజ్, రోల్‌బ్యాక్ పెన్షన్ల పంపిణీ**



**ఆమదాలవలస, ఆగస్టు 10 (వార్త):** అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ రాలేదని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని ఆమదాలవలస పట్టణ మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 50 స్పౌజ్, రోల్‌బ్యాక్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూన రవికుమార్ లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఆధారంలేని కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కొత్తగా మంజూరైన 50 స్పౌజ్, రోల్‌బ్యాక్ పెన్షన్లతో ఆయా కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పెన్షన్ డబ్బులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షన్ మంజూరు కావడంతో తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటు లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని శేఖర్, డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రుణ లక్ష్యాలను త్వరితగతిన సాధించాలి



**మందస, ఆగస్టు 10(వార్త):** ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎంటర్ప్రైనర్లుగా తయారు కావడానికి ఉద్దేశించి వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను త్వరితగతిన సాధించాలని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస పట్టణంలోని మండల మహిళా సమాఖ్య పాలకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలన్నింటికీ ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ముందే అన్ని బ్యాంకులలో అర్హత గల గ్రూపులకు డాక్యుమెంటేషన్ చేయించి, రుణాలు ఇప్పించాలని సూచించారు. తీసుకున్న రుణాలను సద్వినియోగపరుచుకొని కోరమేనా, షెడ్ నెట్, మినీ డైరీ, ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి మన గ్రామంలో మన కుటుంబంతో పాటు కనీసం ఇద్దరు, ముగ్గురుకైనా పని కల్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు రవణమ్మ, కోశాధికారి శారద, అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మితో పాటు స్త్రీనిధి మేనేజర్ సాయిరాం , డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# క్విట్ ఇండియా స్ఫూర్తితో 'జైల్ భరో'

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల ర్యాలీ
-పోలీసుల అడ్డంకులు..
- నాయకులు, పోలీసుల మధ్య తోపులాట



**పలాస, ఆగస్టు 10 (వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పలాస-కాశీబుగ్గలో 'జైల్ భరో' కార్యక్రమం నిర్వహించారు. కాశీబుగ్గ రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ప్రజా సంఘాల నాయకులు, పోలీసుల మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. అయినప్పటికీ ఆందోళనకారులు ర్యాలీగా కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు చేరుకున్నారు. సందర్భంగా సభను ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

అమెరికాతో భారత్ చేసుకునే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణతో రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను కుదించి లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాలు సైతం సక్రమంగా చెల్లించడం లేదని, ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని కోరారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, జిల్లాలో ప్రజలకు సక్రమంగా తాగునీరు కూడా అందని పరిస్థితి నెలకొందని నాయకులు అన్నారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, కరువు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు.

'ప్రశ్నించే గొంతును అణచివేయొద్దు'అని, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని నాయకులు విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారి గొంతును అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పలాస కేంద్రంగా పోలీసులు ప్రత్యేక నిర్బంధ విధానాన్ని అమలు చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే పలాసలో ప్రత్యేకంగా నిర్బంధ విధానాన్ని అమలు చేయాలని చూస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నిర్బంధ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజా పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

పలువురు నాయకుల కాశీబుగ్గ బస్టాండ్ లో నిర్వహించిన సభలో సీపీఎం నాయకుడు కె. మోహనరావు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు టీ. సన్యాసిరావు, న్యూడెమొక్రసీ నాయకుడు వి. మాధవరావు, పౌరహక్కుల సంఘం నాయకుడు పి. దానేసు, ఏఐకేఎం నాయకుడు మద్దిలి రామారావు, సీఐటీయూ నాయకులు ఎన్. గణపతి, ఎస్. లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకుడు వి. ముకుందరావు, పీడీఎస్‌యూ నాయకుడు ఎం. వినోద్‌కుమార్, జీడి రైతు సంఘం నాయకుడు టీ. అజయ్‌కుమార్, జనశక్తి నాయకుడు కోనేరు రమేష్, పీకేఎస్ నాయకుడు పి. దుర్యోధన తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కె. గోపీనాథ్, జి. మొఖలింగం, ఎంపల్ల కామేశ్వరరావు, టీ. భాస్కరరావు, కె. బాలాజీరావు, టీ. రాజు, పౌరహక్కుల నాయకుడు పి. వైకుంఠరావు, ఏఐసీసీటీయూ నాయకులు పి. నాగేశ్వరరావు, కె. లోకనాథం, రైతుకూలీ సంఘం నాయకుడు జి. బాలకృష్ణ, సీఐటీయూ నాయకులు ఆర్. దిలీప్‌కుమార్, ఎన్. మోహనరావు, కె. కేశవరావు, ఎస్. చిరంజీవి, పీవోడబ్ల్యూ నాయకులు పి. కుసుమ, బి. ఈశ్వరమ్మ, రైస్‌మిల్లు కార్మిక సంఘం నాయకుడు జి. కామయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు కె. సుహాసిని, బి. స్వాతి, బి. శశిరేఖ, జె. పుణ్యావతి, పి. గణపతి, సబితా పాత్రో, ఎన్. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీముఖలింగేశ్వర గ్రామోత్సవం

- ఆషాఢ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు
- పల్లకిలో స్వామివారి విగ్రహాల ఊరేగింపు



**జలుమూరు, ఆగస్టు 10 (వార్త):** శ్రీముఖలింగంలో వెలసిన శ్రీ ముఖలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఆషాఢ మాస బహుళ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాత్రి స్వామివారి విగ్రహాలను పల్లకిలో సుందరంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. దీంతో శ్రీముఖలింగం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు



**జలుమూరు, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేట పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాలకు, నరసన్నపేటకు గర్వకారణంగా నిలిచారు. శ్రీకాకుళంలోని కోడి రామమూర్తి స్టేడియంలో ఆగస్టు 6 నుంచి నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన శృతి, ఉషారాణి, దేవిశ్రీ, సోనీ, రేవతి, హేమంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి తెలిపారు.

# రైతుకు ఖేదం..వ్యాపారికి మోదం

ఆమదాలవలస మార్కెట్‌లో రైతుకు తక్కువ ధర.. వ్యాపారి వద్ద భారీ ధర!
కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల తీరుపై రైతుల ఆవేదన
ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ఆముదాలవలస, ఆగస్టు 10 (వార్త):** రైతు కష్టపడి పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతుండగా.. అదే కూరగాయలు మార్కెట్‌కు చేరేసరికి వినియోగదారుల నుంచి వ్యాపారులు భారీ ధరలు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరల వ్యత్యాసం తీవ్రంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వ్యాపారులు, దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కొన్ని కూరగాయలను కిలో రూ.10 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, అవే కూరగాయలను మార్కెట్‌లో రూ.40, రూ.50, రూ.60 వరకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతుకు కష్టానికి తగిన ఆదాయం రాకపోగా, వినియోగదారులపై కూడా అధిక ధరల భారం పడుతోందని పేర్కొన్నారు. పంట సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయని రైతులు తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట పండించినా.. మార్కెట్‌లో మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదని వాపోయారు. మరోవైపు వ్యాపారులు తక్కువ ధరలకు రైతుల నుంచి కొనుగోలు చేసి, భారీ ధరలకు విక్రయించడం వల్ల మధ్యలో దళారులు లాభపడుతున్నారని ఆరోపించారు.

### ప్రభుత్వం స్పందించాలి

కూరగాయల మార్కెట్‌లో ధరల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్‌లో రైతుల నుంచి ఏ కూరగాయను ఎంత ధరకు కొనుగోలు చేయాలి, వినియోగదారులకు గరిష్ఠంగా ఎంత ధరకు విక్రయించాలి అనే వివరాలను స్పష్టంగా బోర్డులపై ప్రదర్శించాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ మార్కెట్ ధరలను ప్రకటించి, రైతులకు కనీస గిట్టుబాటు ధర లభించేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు. "రైతు కష్టానికి విలువ దక్కాలి.. వినియోగదారుడిపై భారం పడకూడదు. ప్రభుత్వం ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించి, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి" అని మార్కెట్‌కు వచ్చిన రైతులు కోరారు.

## పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు



**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేట మండలంలో విద్యాశాఖ ఆదేశాల మేరకు పలు పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని ప్రోత్సహించేందుకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## నిరుపయోగంగా నరసన్నపేట రైతుబజారు

రూ.25లక్షలు వృథా - శిథిలావస్థకు చేరిన భవనం
- అధికారుల చొరవ కోసం స్థానికుల ఎదురుచూపు



**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేట పట్టణంలో చిరు వ్యాపారులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో నిర్మించిన రైతు బజారు దుకాణ సముదాయం నేడు నిరుపయోగంగా మారి వెలవెలబోతోంది. లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ సముదాయం సరైన వినియోగానికి నోచుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1996లో స్థానిక చిరు వ్యాపారులకు దుకాణాలను అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఈ దుకాణ సముదాయాన్ని నిర్మించారు. మొత్తం 50 దుకాణాలు ఏర్పాటు చేసినప్పటికీ, నిర్మాణం పూర్తయిన అనంతరం సముదాయాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం సముదాయంలోని కొన్ని దుకాణాలను కొందరు ఆక్రమించుకుని వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు మిగిలిన దుకాణాలు ఖాళీగా ఉండటంతో భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రజలకు, చిరు వ్యాపారులకు ఉపయోగపడాల్సిన ఆస్తి ఇలా నిరుపయోగంగా ఉండటం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుకాణ సముదాయాన్ని అధికారులు పరిశీలించి ప్రస్తుత పరిస్థితిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి, ఆక్రమణలను తొలగించి అర్హులైన చిరు వ్యాపారులకు దుకాణాలను కేటాయిస్తే రైతు బజారు లక్ష్యం నెరవేరడంతో పాటు స్థానిక వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయానికి పునరుద్ధరణ చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తహసీల్దార్ గారూ.. మీరైనా స్పందించరూ..!

హరిపురంలో నిషేధిత ప్లాస్టిక్‌పై చర్యలు తీసుకోవాలి
వినతిని అందజేసిన సురేష్ కుమార్, మధుబాబు



**మందస, ఆగస్టు 10(వార్త):** ప్లాస్టిక్ ను ప్రభుత్వం నిషేధించింది. కొంతమంది అధికారులు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ.. ప్లాస్టిక్ నిషేధానికి తమ వంతు కృషి చేస్తున్నారు. కానీ, అడ్డదారిలో కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. పర్యావరణానికి హాని చేస్తున్నారు. తహసీల్ధార్ గా మీరైనా స్పందించి న్యాయం చేయాలని రాజకీయ నాయకుడు కొంచాడ సురేష్ కుమార్, బీసీ కార్పొరేషన్ మండల కన్వీనర్ ముడిమించి మధుబాబు కోరారు. ఈ మేరకు వారు ఒక వినతిపత్రాన్ని మందస తహసీల్ధార్ బి.శ్రీహరిబాబుకు అందజేశారు. నిషేధ ప్లాస్టిక్ ఉత్పత్తులు(సింగిల్ యూజ్) వాడకశీతో మూగ జీవులు, ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. 120 మైక్రాన్ క్యారీ బాగ్స్ ఉన్నప్పటికీ వ్యాపారస్తులు వినియోగదారులకు ఉపయోగించడం లేదని ఆరోపించారు. గతంలో దీనిపై ప్రజలకు వ్యాపారస్తులకు అవగాహనా కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ అమ్మకపుదారులకు గత తహసీల్ధార్, హరిపురం గ్రామ కార్యదర్శి నోటీసులు ఇచ్చినప్పటికీ మార్పు కనిపించడంలేదన్నారు. మందస మండలంలోని హరిపురంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై తక్షణమే చర్యలు చేపట్టాలని కొంచాడ సురేష్ కుమార్, ముడిమించి మధుబాబు తహసీల్ధార్ శ్రీహరిబాబును కోరారు.

## నరసన్నపేట ఆసుపత్రికి రోగుల తాకిడి

- ఓపీకి 292 మంది హాజరు
- అందుబాటులో వైద్యులు : ఏవో కాళీచరణ్



**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. ఉదయం 8 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం ఆసుపత్రికి తరలివచ్చారు. సాధారణ రోజుల్లోనూ రోగుల రాకపోకలు ఉన్నప్పటికీ, సోమవారం అధిక సంఖ్యలో రోగులు వైద్య సహాయం కోసం వచ్చినట్లు ఆసుపత్రి ఏవో కాళీచరణ్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహించిన ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో మొత్తం 292 మంది రోగులు వైద్య సేవలు పొందినట్లు రికార్డుల్లో నమోదైందని ఆయన పేర్కొన్నారు. రోగుల సంఖ్య పెరిగినప్పటికీ వైద్యులు అందుబాటులో ఉండి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు మరియు ఇతర సేవలను అందించినట్లు తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సోమవారం ఉదయం నుంచే ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు, వారి సహాయకులతో సందడి నెలకొంది.

## ఉద్దానం కార్మికులకు న్యాయం చేయండి

**సోంపేట, ఆగస్టు 10(వార్త):** గతంలోనున్న ఉద్దానం మంచినీటి పథకంలో కార్మికులుగా పనిచేస్తున్న సుమారు వందమందికి అక్రమంగా తొలగించిన మెగా కంపెనీ తీరును నిరసిస్తూ కార్మికులు సోమవారం శ్రీకాకుళం లో జరిగిన జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఎటువంటి సమాచారం ముందుగా లేకుండా ఇదే వృత్తిని నమ్ముకుని సుమారు 25 ఏళ్లుగా జీవనం గడుపుతున్న కార్మికులను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన మెగా వాటర్ స్కీంకు ఉద్దానం పథకాన్ని అనుసంధానం చేసినప్పటికీ కార్మికులను మాత్రం తొలగించడం భావ్యం కాదని అన్నారు. దీంతో వందకు పైగా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



## డీఎస్సీ అక్రమాలపై లోకేష్ రాజీనామా చేయాలి

- నరసన్నపేటలో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- ర్యాలీకి అనుమతులు లేవంటూ పోలీసుల అడ్డగింత

**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, అవినీతిపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. సోమవారం నరసన్నపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో అక్రమాల కారణంగా ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నరసన్నపేట పట్టణంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాల్లో అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అయితే ర్యాలీ నిర్వహించేందుకు ముందస్తు అనుమతులు లేవని పోలీసులు నాయకులకు సూచించారు. ర్యాలీని నిలిపివేయాలని కోరినప్పటికీ నిరసనకారులు ర్యాలీని కొనసాగించడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. పోలీసు బలగాలతో ర్యాలీని అడ్డుకుని భగ్నం చేశారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

-35వ ఉత్సవాల నిర్వహణపై సమీక్షించిన ప్రముఖ నటుడు ప్రభాస్ శ్రీను

**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేటలోని నాయుడు వీధి, కొత్త వీధి సంయుక్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. సోమవారం స్థానిక వినాయక మండపాన్ని ప్రముఖ నటుడు ప్రభాస్ శ్రీను సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభాస్ శ్రీను మాట్లాడుతూ తన స్వగ్రామమైన నరసన్నపేటలో ప్రతి సంవత్సరం తన ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించనున్న 35వ వినాయక నవరాత్రి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. భక్తి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు స్థానికుల సహకారం తీసుకోనున్నట్లు తెలిపారు. నరసన్నపేటలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో కరువు ఛాయలు.. తక్షణమే డ్రాట్ ప్రకటించాలి

-నారుమళ్లు దెబ్బతిన్నాయి

- రైతును ఆదుకోవాలి

-15లోగా కరువు

ప్రకటించకపోతే ఉద్యమమే



**పలాస, ఆగస్టు 10 (వార్త):** పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో పలాస డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరుతూ పలు రైతు సంఘాల ప్రతినిధులు పలాస ఆర్డీవో ఆర్.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. వంశధార సాగుజల సాధన కమిటీ, పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ, మహేంద్ర రైతు సంఘం, చైతన్య రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు ఈ వినతిపత్రాన్ని పలాస ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అందజేశారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో అధికశాతం మంది రైతులు వర్షాధారిత వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు. వరుసగా ఎదురవుతున్న వర్షాభావ పరిస్థితులతో సాగు కష్టమై రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు జీవనోపాధి కోసం వలస కార్మికులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార జలాలను ఇచ్ఛాపురం వరకు విస్తరించాలని, కరువు పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలంటే వంశధార సాగునీటిని ఇచ్ఛాపురం వరకు విస్తరించాలని రైతులు డిమాండ్ చేశారు. సాగునీటి సౌకర్యం కల్పిస్తే రైతులకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పంటల పరిస్థితి ఆందోళనకరమని, ప్రస్తుత సీజన్‌లో నారుపోసి, నాట్లు వేసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని రైతులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు దెబ్బతిని కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ప్రయోజనం కంటే నష్టమే వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపాతం నమోదుకు శాస్త్రీయ విధానం అవసరమని, వర్షపాతం నమోదు విషయంలో మరింత శాస్త్రీయ విధానం పాటించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండలంలో పల్లపు ప్రాంతం, ఉద్దాన ప్రాంతం, గిరిప్రాంతాల్లో వర్షపాతం నమోదు పరికరాలు ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో నమోదయ్యే వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకుని సగటు వర్షపాతాన్ని నిర్ణయించాలని కోరారు. పంటల బీమాపై స్పష్టత ఇవ్వాలని, రైతులు పంటల బీమా చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్న నేపథ్యంలో, కరువు పరిస్థితులను అధికారికంగా ప్రకటించకపోతే బీమా ప్రయోజనాలు రైతులకు ఏ విధంగా అందుతాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని రైతులు కోరారు. కరువు ప్రాంతంగా గుర్తింపు, పంటల నష్టం అంచనా, బీమా పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలాస డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించే ప్రక్రియను ఈ నెల 15లోగా చేపట్టాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నిర్ణయం తీసుకోకపోతే దశలవారీగా రైతుల ఆధ్వర్యంలో న్యాయపరమైన, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. తద్వారా ఏర్పడే పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశధార సాగుజల సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు, నల్లహడ్డి, కొర్ల రామారావు చౌదరి, కొవ్వూరు దశరధి, పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ, చైతన్య రైతు సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు, తామాడ తిటోచంద్రరావు, దాసరి శ్రీరాములు, మద్దెల ధర్మారావు, తామాడ గంగయ్య, చింతాడ చలపతిరావు, వాయలపల్లి మాధవరావు, వెదుళ్ల మాధవరావు, దేవాడ నారాయణరావు, బొడ్డు సింహాద్రి, గున్న నారాయణరావు, గున్న మురళి, గున్న మోహనరావు, డొక్కరి వీరస్వామి, రాపాక చిన్నయ్య, మజ్జి రమణారావు, బత్తిని వాసు, బెస్త కామేశ్వరరావు, కోరాడ లింగమూర్తి, శశిధర వర్మ, సాలిల వీరాస్వామి, దుంపల వైకుంఠరావు, బమ్మిడి భూపతిరావు, మడ్డు జ్యోతి, మాచేపురి లత, నాగమణి, అగును సూర్యరావు, కర్రీ గోపాలకృష్ణ, పుచ్చ దుర్యోధన, ఢిల్లీ జానకరావు, జన దుర్యోధన, తెలగవలస జోగారావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## చీడిపూడి జేబీటీ పాఠశాలలో ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు

- 8 రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- వ్యవస్థాపకుడు జోగుమహంతి మోహన్ గాంధీ



**సారవకోట, ఆగస్టు 10 (వార్త):** చీడిపూడి జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకునేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ మాట్లాడుతూ ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎనిమిది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎనిమిది రోజుల పాటు విద్యార్థులకు వివిధ రకాల రంగవల్లి పోటీలు, క్రీడా పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆయా కార్యక్రమాలు జరిగిన రోజే బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందడిగా సాగాయి.

## పూర్తికాని సచివాలయంలోనే ప్రభుత్వ కార్యకలాపాలు

-చిన్న కిట్టాలపాడు సచివాలయ భవనంపై విమర్శలు

- నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించాలని స్థానికుల విజ్ఞప్తి



**సారవకోట, ఆగస్టు 10 (వార్త):** చిన్న కిట్టాలపాడు గ్రామ సచివాలయ భవన నిర్మాణం నేటికీ పూర్తికాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ అందులోనే ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలనను అందించడంతో పాటు గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆశించిన స్థాయిలో సౌకర్యాలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వినియోగించడం వల్ల ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. పూర్తికాని నిర్మాణాన్ని ఇలా వినియోగించడం వల్ల ప్రభుత్వ లక్ష్యం, సచివాలయ వ్యవస్థ ఉద్దేశం దెబ్బతింటుందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చిన్న కిట్టాలపాడు సచివాలయ భవనాన్ని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను గుర్తించి పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భవనాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రైవాడలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం
- సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ధర్మాన తేజ్‌కుమార్

**సారవకోట, ఆగస్టు 10 (వార్త):** గొర్రిబంద పంచాయతీ పరిధిలోని రైవాడ గ్రామంలో సోమవారం 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టీడీపీ రథసారథి, రాష్ట్ర బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. గ్రామస్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తేజ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.



## చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమానికి ప్రాధాన్యం



**సారవకోట, ఆగస్టు 10 (వార్త):** చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం సారవకోట-4లో రూ.16 లక్షల నిధులతో అన్ని వసతులతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులకు చిన్నతనంలోనే నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందుబాటులోకి రావడం ద్వారా వారి మానసిక, శారీరక వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. పౌష్టికాహార లోపాన్ని నివారించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన ప్రాంతాల్లో మిగిలిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తూ చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం నూతన భవనంలో ఏర్పాటు చేసిన తాగునీరు, విద్యుత్, ఆట వస్తువులు, పౌష్టికాహార నిల్వ సదుపాయాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలోని చిన్నారులతో కొద్దిసేపు సరదాగా గడిపి వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పొద్దిన రత్నాలునాయుడు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తాడేల భీమారావు, యూనిట్ ఇన్‌చార్జీలు కోన వెంకటేష్, పొదిలాపు వేణుగోపాలరావు, గొంటి శంకర్, ఇసా నాగరాజు, బొడ్డేపల్లి సుధాకర్, ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్, నిక్కు జనార్ధన, బోయిన రవికుమార్, నక్క గోపి, పిల్లా నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు బాధితులను పరామర్శించిన కోత

త్వరగా కోలుకోవాలని

ఆకాంక్షించిన పూర్ణచంద్రరావు



**మందస, ఆగస్టు 10(వార్త):** పిడుగుపాటు బాధితులను జనసేన నాయకుడు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు పరామర్శించారు. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల పెడంగో గ్రామంలో జరిగిన పిడుగు పాటుకు ఇద్దరు గిరిజన మహిళలు మరణించారు. వీరితో పాటు మరో నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన గిరిజన మహిళలు హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, బాధితులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు జనసేన నాయకులు అండగా ఉంటామని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని కోరారు. పిడుగుపాటు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని జనసేన నాయకులు సూచించారు.

## యూటీఎఫ్‌తోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

- ప్రభుత్వ శ్వేతపత్రం అవాస్తవం
- యూటీఎఫ్ మందస మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు

**మందస, ఆగస్టు 10(వార్త):** రాష్ట్ర ఆదాయమంతా ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతుందంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం పూర్తిగా అవాస్తవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మందస మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు ఖండించారు. మందస మండలం హరిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య అధ్యక్షతన యూటీఎఫ్ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ, 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. పీఆర్సీ, కరువు భత్యం(డీఏ), మధ్యంతర ఉపశమనం(ఐఆర్) వంటి ఆర్థిక సంబంధ అంశాలను సకాలంలో పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం, ఉద్యోగులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని స్పష్టం చేశారు.

### ఐదు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి

యూటీఎఫ్ పతాకావిష్కరణ చేసిన మండల గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏ బకాయిలను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు లఖినాన సాంబమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి, ప్రభుత్వ పాఠశాలలు, విద్యావ్యవస్థ పరిరక్షణకు యూటీఎఫ్ అనునిత్యం పోరాడుతోందని, యూటీఎఫ్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఉపాధ్యాయులందరూ పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యాప్‌లలో ప్రవేశపెట్టిన 'స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్' విధానం ఏమాత్రం సమంజసంగా లేదని, ఆ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మందస మండల పూర్వపు ప్రధాన కార్యదర్శి కంచరాన మాధవరావు, సహాధ్యక్షుడు ధర్మార్పు కిరణ్, సీనియర్ నాయకులు పి.జి.టి. కె.రవీంద్ర, జిల్లా కౌన్సిలర్లు తరణి సోమేశ్వరరావు, గున్న చంద్రశేఖర్, మండల కార్యదర్శులు పాలిన సాయికుమార్, జి.మల్లేశ్వరరావు, గొరకల లోకేష్, జి.గంగారావు తదితర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## షైనింగ్ స్టార్ శ్రావ్యకు ఎన్ఆర్ఐ నరేష్ ఆర్థికసాయం

- ప్రతిభకు ప్రోత్సాహం.. రూ.10 వేలు అందజేత



**పలాస, ఆగస్టు 10 (వార్త):** బడగాం పంచాయతీ కాశీరాజుకాశీపురం గ్రామానికి చెందిన దుంపల జోగారావు, తులాసమ్మ దంపతుల కుమార్తె దుంపల శ్రావ్య పదో తరగతిలో ప్రతిభ కనబరిచింది. తురకల కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఆమె 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 578 మార్కులు సాధించి నందిగాం మండలంలో ద్వితీయ స్థానం కైవాసం చేసుకుంది. ఈ ప్రతిభకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా శ్రావ్య 'షైనింగ్ స్టార్' అవార్డు అందుకుంది. విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ బడగాం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శిష్టు నరేష్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోణంకి ఢిల్లేశ్వరరావు, లఖినాన విశ్వనాధం, సనపల రమేష్, పున్నయ్య, లోకనాదం, సత్యం, హరికృష్ణ, దుంపల గోపి, కెల్లి గోపాలకృష్ణ, బగాది వెంకటరమణ, గోవింద్, రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ ట్రై సైకిళ్ల పంపిణీ



**బూర్జ, ఆగస్టు 10 (వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో బూర్జ మండలంలోని అన్ని గ్రామాలకు చెత్త సేకరణ ట్రై సైకిళ్లను ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ పంపిణీ చేశారు. బూర్జ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను క్రమం తప్పకుండా సేకరించి, తడి--పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా పారిశుధ్య సమస్యలను నియంత్రించవచ్చన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో చెత్త సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ట్రై సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని, వీటి ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం సులభతరం అవుతుందని తెలిపారు. స్వచ్ఛమైన గ్రామాలు, ఆరోగ్యకరమైన ప్రజలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ శివాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వ ప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ, పీరికట్ల సీతాబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉన్నతులుగా ఎదిగి.. సార్థకత తీసుకురావాలి

-సమాజంలో మంచి, చెడులను గుర్తించాలి

- విద్యార్థినిలతో ఆత్మీయంగా మాట్లాడిన కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని
- బుడంబో గిరిజన ఆశ్రమంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం

**మందస, ఆగస్టు 10(వార్త):** తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా నడచుకోవాలని, మంచిపేరు తీసుకురావాలని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని కోరారు. మందస మండలంలోని సాబకోట పంచాయతీలో గల ప్రభుత్వ గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ లతో కలసి సందర్శించారు. విద్యార్థినిలతో డీఎస్పీ భవానీ ఆత్మీయంగా మాట్లాడారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్యకు వ్యయం చేస్తోందని, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదవిస్తున్నారని, ఉన్నతస్థాయికి ఎదిగి వారిని ఆదుకోవాలని అన్నారు. పోటీతత్వంతో చదువుకోవాలని, అప్పుడే ఉత్తీర్ణులవుతారన్నారు. ప్రతీ ఒక్కరిలో పట్టుదల ఉండాలన్నారు. మీలో ఎవరికైనా వ్యక్తిగత సమస్యలు, చిన్న చిన్న సమస్యలుంటే తనకు కానీ, పోలీసులకు కానీ చెప్పుకోవాలన్నారు. లేదా 112 ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థినిలను సొంత పిల్లల్లా చూసుకోవాలని ఉపాధ్యాయులకు చెప్పారు. కాగా, ఆశ్రమంలో సీసీ కెమేరాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ వార్డెన్, మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ లకు సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమం ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# శాఖాభేదం లేని ఏకైక సంఘం శ్రీ బాలభాను

### - సింహాచలం దేవస్థానం

### ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు



**శ్రీకాకుళం, ఆగస్టు 10 (వార్త):** బ్రాహ్మణులు ఐకమత్యంతో సంఘటితంగా ఉంటేనే తమ సమస్యలను పరిష్కరించుకోగలరని సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అన్నారు. శాఖాభేదం లేని ఏకైక సంఘంగా శ్రీ బాలభాను అర్చక పురోహిత సంఘం నిలుస్తోందని పేర్కొన్నారు. శ్రీకాకుళం అరసవిల్లి ఎల్ఎన్ గ్రీన్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ బాలభాను అర్చక పురోహిత సంఘం 19వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జె. కామేశ్వరశర్మ, ఎం. కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం విఘ్నేశ్వర పూజ, రుద్రాభిషేకంతో ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. శ్రీ బాలభాను అర్చక పురోహిత సంఘం ఏర్పడి 18 సంవత్సరాలు పూర్తిచేసుకుని 19వ వార్షికోత్సవాన్ని శ్రీకాకుళంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘం మరింత బలోపేతమై బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. స్వాతి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చుని, ఆ ఐకమత్యం శ్రీ బాలభాను సంఘ సభ్యుల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.


### విద్యార్థులకు ప్రోత్సాహకాలు

6 నుంచి 18 సంవత్సరాల వయసు గల విద్యార్థుల్లో క్రీడలు, కళా నైపుణ్యం, విద్యా రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సంఘం తరఫున ప్రోత్సాహకాలు అందజేశారు. స్వాతి శంకర్, గుండ లక్ష్మీదేవి, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు.

### సుసరాపు గణపతి శర్మ దంపతులకు పాదపూజ

సింహాచలం దేవస్థానం పాలకమండలి సభ్యులు సుసరాపు గణపతిశర్మ దంపతులకు సంఘ కార్యవర్గం, సభ్యులు పాదపూజ నిర్వహించారు. అనంతరం సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలువురు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పండితులు ఎస్. చంద్రంబాబు, శ్రీకాకుళం బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జి. నగేష్, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి దినమణిశర్మ, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి సత్యనారాయణశర్మ, విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి రాజేష్‌శర్మ, సుసరాపు గోవిందశర్మ, బాలమురళీశర్మ, ఏరియా ఇన్‌చార్జిలు, కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.





## ఇచ్ఛాపురంలో కైండ్‌నెస్ వాల్ ప్రారంభం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్. బెందాళం అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకుని, బలగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరివిల్లు సూపర్‌మార్కెట్, రైల్వే గేట్ సమీపంలో "కైండ్నెస్ వాల్" ను ప్రారంభించారు.బలగం ఫౌండేషన్ చైర్మన్ కాళ్ల జైదేవ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పట్టణ టీడీపీ అధ్యక్షులు తవిటయ్య, కార్యదర్శి కోటితో పాటు పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు జేసీఐ అధ్యక్ష, కార్యధర్సులు శ్రావణ్, సంతోష్ సాహు యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రాంబాబు గ్రామ పెద్దలు హాజరయ్యారు."మీకు అవసరమైనది తీసుకోండి -- మీకు అవసరం లేనిది వదిలివెళ్లండి" అనే సందేశంతో ఏర్పాటు చేసిన కైండ్నెస్ వాల్‌లో దుస్తులు, బొమ్మలు, స్టేషనరీ, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తదితరాలను దానం చేసుకునే, అవసరమైన వారు తీసుకునే విధంగా విభాగాలను ఏర్పాటు చేశారు.అవసరం లేని వస్తువులను వృథా కాకుండా అవసరమైన వారికి అందించడం, మానవత్వం పంచుకునే సంస్కృతిని పెంపొందించడం కైండ్నెస్ వాల్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ వినూత్నమైన మానవతా కార్యక్రమాన్ని హాజరైన ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తూ బలగం ఫౌండేషన్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ బలగం ఫౌండేషన్ అధ్యక్షులు కాళ్ల సిద్ధు కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా అశోక్ జన్మదిన వేడుకలు



## పిడుగుపాటు మృతుల కుటుంబాలకు శిరీష పరామర్శ

### -బాధితులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే

### - ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ

**మందస, ఆగస్టు 10(వార్త):** బుడారిసింగి పంచాయతీలోని పెదంగో గ్రామం వద్ద పొలం పనులు చేసుకుంటున్న గిరిజనులపై పిడుగు పడింది. దీంతో ఇద్దరు గిరిజన మహిళలు అక్కడికక్కడే మరణించారు. నలుగురు గిరిజన మహిళలకు తీవ్ర గాయలయ్యాయి. పిడుగు పడి మరణించిన కట్టా సాముద్రి, సవర జొర కుటుంబాలను పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరిషా సోమవారం రాత్రి పరామర్శించారు. పాతకోట, పెదంగో గ్రామాలకు వెళ్లి, వారి కుటుంబాలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఓదార్చారు. సానుభూతి తెలిపారు. మరణించిన కుటుంబాలకు భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందివ్వడానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా పిడుగుపాటు గాయాల పాలైన కుటుంబాలను సైతం పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్ లబ్బ రుద్రయ్య, మందస పట్టణ అధ్యక్షుడు గార కృష్ణారావు, ముంజేటి చంద్రశేఖర్, రట్టి లింగరాజు, ఔగాన ఈశ్వరరావు, అడ్డి ఈశ్వరరావు, బేసి ఈశ్వరరావు, సంతోష్ కుమార్ గౌడ, రమ్మో మహానాయక్, నీలాంచల్ సాహు, ఢిల్లేశ్వర దొళాయి, భౌరిగౌడో, కుమార్ దొళై, మజ్జి గాంధారి, జనసేన నాయకుడు సంతోష్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

### నేడు సరియాపల్లిలో ఇంటింటికీ తెలుగుదేశం

మందస మండలంలోని సరియాపల్లి గ్రామంలో ఈనెల 11న పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు మందస మండలం సరియాపల్లి గ్రామంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుర్యోధన పిలుపునిచ్చారు.

## కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో దిజేష్ అద్భుత విజయం

### అండర్-9 కేటగిరిలో కాంస్య పతకం

### అభినందించిన ఉద్దానం ప్రజలు



**మందస, ఆగస్టు 10(వార్త):** అతి చిన్న వయస్సులోనే కరాటేలో కాంస్య పతకం సాధించి దిజేష్ అబ్బురపరిచాడు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీలోని మత్స్యకార గ్రామమైన గెడ్డవూరు గ్రామానికి చెందిన కోడ దిజేష్ న్యూఢిల్లీలోని టాకటోరా ఇండోర్ స్టేడియం లో జరిగిన 20వ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ కప్ కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో అండర్-9 కేటగిరీ లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. తండ్రి కోడ బలరాంస్వామి ప్రోత్సాహంతో కోడ దిజేష్ జాతీయ స్థాయిలో ఈ అద్భుత విజయం సాధించాడు. కార్మే సీనియర్ సెకండరీ స్కూల్ లో దిజేష్ 4వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలలో దేశం నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. చిన్న వయసులోనే ఇంత పెద్ద వేదికపై తన పోరాట పటిమ, క్రమశిక్షణ, కృషితో దిజేష్ కాంస్య పతకం గెలుచుకోవడం విశేషం. చిన్నప్పటి నుండి కరాటే పై ఆసక్తి ఉన్న దిజేష్ రోజూ కఠోర శిక్షణ తీసుకుంటూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాడు. తండ్రి కోడ బలరాంస్వామి కుమారుడి విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, దిజేష్ ఇంకా ఉన్నతంగా ఎదిగి దేశానికి పేరు తెస్తాడని ఆకాంక్షించారు. దిజేష్ ఈ ఘన విజయాన్ని సాధించడం పట్ల పిచ్చుక జయరాం, పిచ్చుక శాంతారావు, వంక సురేష్, గోపాలరావు, ధర్మారావు, అండమాన్ లో ఉన్న గెడ్డవూరు గ్రామ సంఘం, మత్స్యకార సంఘ నాయకులు కూడా దిజేష్ ని అభినందిస్తూ.. మా గ్రామ బిడ్డ జాతీయ స్థాయిలో పతకం సాధించడం మాకు గర్వకారణమని, ఇది మిగతా పిల్లలకు స్ఫూర్తి అని తెలిపారు.



**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మ వారి ఆలయం లో ఎమ్మెల్యే నామగోత్రం లతో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ లో వైద్య శిబిరం నిర్వహించారు.రక్తదాన శిబిరం కూడా పెద్ద ఎత్తున స్పందన లభించింది. అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమ లో ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షుడు పత్రి తవి టయ్య, మండలం అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, కాళ్ల దిలీప్ యాదవ్ ఆసి లీలా రాణి నందికి జానీ కోటి లింగరాజు చిన్నా శ్రీనివాస్ సంతోష్ కృష్ణ ధర్మరాజు రాహుల్ మోహన్ నారాయణ గిరీష్ ఢిల్లీ రామారావు జన్నెల సంతోష్ సూరి వెంకట్ ప్రసాద్ పాల్గొన్నారు. మండల పార్టీ నాయకులు , డి కామేశ్వరరావు, దక్కత ఢిల్లీ రావు సాడి సహదేవ్, మెరుగు సూర్యనారాయణ, లోహి, మాధవ,ఎర్రయ్య, రామారావు, గణపతి, డిల్లీ,కృష్ణ మాధవరావు చంద్రశేఖర్ సారధి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఏడు పదుల్లో ఆత్మీయ కలయిక

**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 1973-74 లో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 70 ఏళ్ల వయస్సులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.పూర్వ విద్యార్డుల కలయిక మాటూరి సూర్యము కల్యాణ మండపములో ప్రముఖ వ్యాపారవేత్త మాటూరి సూర్యము ఆధ్వర్యములో జరిగింది. ఈ కార్యక్రమములో వృద్ధులైన పూర్వ విద్యార్థులు వారి కుటుంబ నేపథ్యన్ని వివరిస్తూ పునః పరిచయాన్ని చేసుకున్నారు. 52 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు వృద్ధాప్యమువలన వారి రూపములు మారిపోవుట వలన చిన్న నాటి సంఘటనలు సింహావాలోకనము చేసుకుంటూ, గతాన్ని గుర్తు చేసుకుంటూ 50 ఏళ్ల జీవితాన్ని కష్టసుఖాలను నెమరువేసుకుంటూ ఆనంద భాష్పలతో, ఆలింగనాలతో ఆత్మీయ అనురాగాలతో కలుసుకున్నారు. భోజనాల అనంతరము విడరాణి స్నేహాన్ని వీడ్కోలు పలుకుతూ దుఃఖం న్ని దిగమింగుతూ సుదూర ప్రాంతాలకు పయనమయ్యారు.



# సూదికొండ సమస్యలపై చర్చ

### -వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

### - అర్హులైన వారికి పెన్షన్లు

### - మున్సిపల్ ఎన్నికలపై నాయకుల సమాలోచన

**పలాస, ఆగస్టు 10 (వార్త):** పలాస మున్సిపాలిటీ పరిధిలోని సూది కొండ సూర్యకాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలు, రానున్న మున్సిపల్ ఎన్నికల పరిస్థితులపై నాయకులు, స్థానిక పెద్దలు, యువజన నాయకులు ఆత్మీయంగా చర్చించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్థానికులతో సోమవారం సమావేశమై వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూది కొండ వార్డు యువజన నాయకులు సైని శివ, సీ. పాన శ్రీరాములు, పెద్దలు పైల షణ్ముఖరావు ఇంటి వద్ద ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు వార్డులో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను గిరిబాబు దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన వారికి పెన్షన్లు అందేలా చర్యలు చేపట్టాలని, పెన్షన్ల సమస్యపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు అందని వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అర్హులైన వృద్ధులు, భర్తలను కోల్పోయిన మహిళలకు సంబంధిత పథకాల ద్వారా పెన్షన్లు అందేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని బల్ల గిరిబాబు హామీ ఇచ్చారు. ఎన్నికలపై సమాలోచన చేస్తూ రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డులో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించడం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, పెద్దలు వల్లభ వైకుంఠరావు, డి. నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు. వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.



## వైఎస్సార్సీపీ ర్యాలీపై పోలీస్ ఆంక్షలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** వైస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం లో నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి నేత్రత్వంలో డి ఎస్ సి అక్రమాలు కి వ్యతిరేకం గా మోటార్ బైక్ ర్యాలీ కి పిలుపునివ్వగా పోలీస్ ల నిర్భందాల మధ్య ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ ఆఫీస్ వద్దకు వందలాది మంది వైస్సార్సీపీ శ్రేణులు చేరుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం నలుమూలలా పోలీస్‌లు వైస్సార్సీపీ నాయకులని, కార్యకర్తలను నిలువరించినప్పటికి నిర్దారత ప్రాంతానికి వందలాది మంది వైస్సార్సీపీ శ్రేణులు చేరుకొని డి ఎస్ సి అక్రమాలపై సిబిఐ విచారణ చేయ్యాలని, విద్యాశాఖమంత్రి లోకేష్ రాజీనామా చెయ్యాలని నినాదాలు చేశారు. బైక్ ర్యాలీ కి అనుమతి లేదని పోలీస్ లు అడ్డుకోవడంతో కాలినడకన వెళ్తామని ర్యాలీ ప్రారంభించిన వైసీపీ శ్రేణులని పోలీస్ లు రోప్ లతో అడ్డుకున్నారు. కొంతసేపు ప్రతిఘటన తరువాత కూడా పోలీసులు ర్యాలీ కి అనుమతించక పోవడంతో కొంతసేపు పోలీస్ లతో వాగ్వివాదం జరిగి రోడ్ పై బైటయించి నినాదాలతో నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ నర్తు రామారావు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పిరియ విజయ, పి ఏ సి మెంబెర్ పిరియ సాయి రాజు ఎంపిపి బోర పుష్ప జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, మాజీ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మాజీ వైస్ ఛైర్ పర్సన్ లు ఉలాల భారతి దివ్య లాభాల స్వర్ణ మని తడక జోగారావు కడియాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546